అడుగంటుతున్న భూగర్భ జలాలు



పలమనేరు ప్రాంతంలోని చెరువుల్లో ఇష్టానుసారం తవ్వేసిన పరిస్థితి



బోరులో నీరు రాక ఎండుతున్న రాగిపంట

అసలే కష్టాల్లో ఉన్న రైతన్నకు అడుగంటుతున్న నీటితో కష్టాలు తప్పడం లేదు. భూగర్భ జలాలు అడుగంటి మొన్నటి దాకా రెండు ఇంచీలు వస్తున్న నీరు ఇప్పుడు ఇంచీకి పడిపోయింది. ఈ క్రమంలో రైతులు బోర్లను డీపెనింగ్ చేయించడం లేదా కొత్త బోర్లను వేయించడం చేస్తున్నారు. అప్పోసప్పో చేసి బోరు వేసినా నీరు పడుతుందన్న నమ్మకం లేదు. మూడేళ్ల క్రితం 750 అడుగుల్లో నీరు పడుతుండగా.. ప్రస్తుతం వెయ్యి అడుగులపైగా వేస్తే గాని నీరు వచ్చే పరిస్థితి లేదు. చెరువులు, నదుల్లో ఇసుక తవ్వకాలు, మట్టి తోడేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

- పనిచేయని వ్యవసాయ బోర్లు
- వెయ్యి అడుగులు తవ్వినా కనిపించని చుక్క నీరు
- మట్టి కోసం చెరువులను చెరబట్టిన పచ్చ బ్యాచ్
- వాగులు, వంకలు, నదులనూ వదలని వైనం





పలమనేరు ప్రాంతంలో ఎండిపోయిన వ్యవసాయ బోరు, చెరువులో మట్టి తవ్వుతున్న జేసీబీ

పలమనేరు: పలమనేరు రెవిన్యూ డివిజన్‌లో 80 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. నదులు, వాగులు, కాలువలు లేకపోవడంతో రైతులు పూర్తిగా బోరు బావుల పైనే ఆధారపడాల్సి వస్తోంది. పొలాల్లో బోర్లు వేసుకుని పంటలను సాగు చేసుకుంటున్నారు. డివిజన్ పరిధిలో 80 వేల వ్యవసాయ బోర్లున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి 20 వేల బోర్లలో రెండు ఇంచీల వస్తున్న నీరు ప్రస్తుతం ఇంచీ కూడా రావడం లేదు. గత నెల రోజుల్లో చాలా బోర్లు ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండుతుంటే ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు తలలు పట్టుకుంటున్నారు. కొందరు రైతులు మాత్రం అప్పులు చేసి కొత్త బోర్లు వేసుకుంటున్నారు. మరికొందరు పాత బోర్లను డీపెనింగ్ చేస్తున్నారు. పదిలో మూడింటిలో మాత్రమే నీటి జాడ కనిపిస్తోంది.

యథేచ్ఛగా చెరువుల్లో తవ్వకాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువుల్లో మట్టి, ఇసుక తవ్వకాలు పెరిగాయి. కొందరు అక్రమార్కులు అధికారం అండతో రేయింబవళ్లు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. చెరువులను సర్వనాశనం చేశారు. దీంతో భవిష్యత్తులో వర్షాలు పడినా చెరువుల్లో నీరు నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. అంతేగాక వాగులు, వంకలు, కౌండిన్య నదిదేన్నీ వదలకుండా ధ్వంసం చేశారు. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రికి కొత్త హంగులు

- అత్యవసర, ఇన్ పేషెంట్ బెడ్లకు ఆక్సిజన్ సాకర్యం
- ఎల్ఎంవో ట్యాంకులో పదివేల లీటర్ల ఆక్సిజన్ నిల్వ
- త్వరలో వీఎస్ఏ, పీఎస్ఏ యూనిట్లకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో అధునాతన సౌకర్యాలతోపాటు అన్ని వార్డులకు ఆక్సిజన్ సౌకర్యం కల్పించారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై ఈ నెల 26న ఆక్సిజన్ కనెక్షన్ ఎప్పుడిస్తారు సారూ అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే అన్ని పనులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో హుటాహుటిన ఆక్సిజన్ పైపులైన్లు ఏర్పాటు చేశారు. వీటిని వారంలో అధికారికంగా ప్రారంభించనున్నారు. గత ప్రభుత్వం ఈ ఆస్పత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేసి నాడు – నేడు కింద నాబార్డ్ 25 ట్రాంచ్ నిధులు రూ.16 కోట్లతో అభివృద్ధి చేసింది. 50 మందికి సరిపడా ఆక్సిజన్ అందించేలా ప్లాంట్‌ను ఏర్పాటుచేసింది. బెడ్లకు ఆక్సిజన్ అందించే పైపులైన్ అమర్చలేదు. ఎట్టకేలకు ఈ పనులను చేపట్టారు. ఆస్పత్రి వద్ద గాలి ద్వారా ఆక్సిజన్‌ను తయారు చేసేందుకు ఉద్దేశించిన పీఎస్ఏ(ప్రెజర్ స్వింగ్ అజార్ప్షన్) యత్రం, వీఎస్ఏ(వ్యాక్యూమ్ స్వింగ్ అజార్ప్షన్) పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని వెంటనే చేయాలని సంబందిత శాఖకు సూపరిండెంటెంట్ ఆదేశించారు.



ఆపరేషన్ థియేటర్‌లో ఏర్పాటు చేసి ఆక్సిజన్ పైపులైన్



ఆస్పత్రిలో సిద్ధమైన ఎల్ఎంవో ఆక్సిజన్ ట్యాంకు

ప్రస్తుతానికి పదివేల లీటర్ల ఆక్సిజన్‌ను ఎల్ఎంవో ప్లాంట్‌లో నింపారు. దాని నుంచి ఆక్సిజన్‌ను ఆస్పత్రికి సరఫరా చేసే పనులను పూర్తిచేశారు. తద్వారా మూడు నెలలపాటు ఆక్సిజన్‌కు ఇబ్బంది ఉండదని అధికారులు తెలిపారు.

ఆక్సిజన్ సౌకర్యం పూర్తి స్థాయిలో వచ్చినట్లే..



ఎమర్జెన్సీ రోగులతోపాటు ఆపరేషన్ థియేటర్లకు ఆక్సిజన్ యూనిట్ ద్వారా మూడు పైపులైన్ల సిస్టం ద్వారా ఆక్సిజన్ హుమిడి ఫైర్, వ్యాక్యూమ్‌లు ఏర్పాటు చేశాం. అన్ని రకాల ఆపరేషన్లు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. 23 మంది స్పెషలిస్టులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం 15 మంది మాత్రమే ఉన్నారు. సివిల్ సర్జన్, ఆర్ఎంవో, డిప్యూటీ సివిల్ సర్జన్, ఐదుగురు అసిస్టెంట్ సర్జన్ల అవసరముంది. ఈ విషయాన్ని కలెక్టర్‌కు చెప్పాం.

–డాక్టర్ మమతారాణి, ఆస్పత్రి సూపరిండెంటెంట్, పలమనేరు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



పలమనేరు: మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

పలమనేరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ దోమకాటు, నీటి కలుషితం వల్ల వచ్చే రోగాలను వివరించారు. గ్రామాల్లోని మంచి నీటి ట్యాంకులను 15 రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. దోమల నివారణ కోసం ప్రతి శుక్రవారమూ డ్రై డేను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, మెడికల్ ఆఫీసర్ అనౌఖి, సబ్ యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.



బైరెడ్డిపల్లె : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: సీజనల్ వ్యాధుల పట్ల పూర్తి అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని తీర్థం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ తెలిపారు. ఆమె గురువారం లక్కనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా, అతిసారం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిన్న వయసులోనే వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రతి రోజూ సుమారు గంట పాటు వ్యాయామం, యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. హెచ్ఎం కవిత, ఎంఎల్‌హెచ్‌పీ సావిత్రి పాల్గొన్నారు.

లారీ ఢీకొని వైఎస్సార్ సీపీ నాయకుడికి తీవ్ర గాయాలు

గంగవరం: మండలంలోని మేలుమాయి రోడ్డు వద్ద గురువారం బైక్‌ను లారీ ఢీకొనడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. మేలుమాయి పంచాయతీ మొత్కులపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యంరెడ్డి అలియాస్ మణిరెడ్డి(67) బైక్‌లో మేలుమాయి బయలుదేరాడు. మేలుమాయి రోడ్డును క్రాస్ చేస్తుండగా పలమనేరు వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బలిజ భవనం ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ

కుప్పం: కుప్పం మున్సిపాలిటీలోని పల్లార్లపల్లి రెవెన్యూలో బలిజ భవనానికి కేటాయించిన స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రహరీ గోడ నిర్మాణానికి రూ.30 లక్షల కడా ప్రత్యేక నిధులు కేటాయించినట్టు తెలిపారు. పనులు వేగవంతం చేయాలని, అవసరమైతే అదనంగా మంజూరు చేస్తామని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబు, సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, మంజునాథ్, హర్షగోపీనాథ్, సోమశేఖర్, ఆర్ముగం పాల్గొన్నారు.

శ్రీనివాసులు సేవలు మరువలేనివి



శ్రీనివాసులును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కుప్పం రూరల్: ఉపాధ్యాయుడు శ్రీనివాసులు చేసిన సేవలు మరువలేనివని అడవిబూదుగూరు ప్రధానోపాధ్యాయులు చిట్టిబాబు తెలిపారు. వాలూరులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన శ్రీనివాసులును గురువారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఇందులో ముఖ్య అతిథిగా చిట్టిబాబు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లగా శ్రీనివాసులు విద్యా రంగంలో ఉపాధ్యాయుడిగా ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రమణయ్య, దాము తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమం తనిఖీ



చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు ప్రతి ఇంటి నుంచీ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. అక్కడ వర్మీకంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయించాలన్నారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీలో అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి హరిబాబు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో పోలీసుల తనిఖీలు

పుంగనూరు: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో తనిఖీ చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకుల్లో జరుగుతున్న దొంగతనాలను అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. పట్టణంలోని బ్యాంకు ఏటీఎంలు, సీసీ కెమెరాలు, లైటింగ్ సిస్టమ్, స్ట్రాంగ్ రూము పటిష్టత, సెక్యూరిటీ గార్డుల నియామకం, బ్యాంకుల భద్రతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నామని తెలిపారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి



హాస్టల్ పిల్లలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు

పలమనేరు: స్థానిక బీసీ హాస్టల్‌లోని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు డిమాండ్ చేశారు. వారు గురువారం రాత్రి హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తనిఖీ చేశారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరేష్‌కుమార్, మనోజ్, అశ్వర్థరెడ్డి, మహేష్, సునీల్ పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ

పుంగనూరు: పట్టణంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను గురువారం ఏఐఎస్ఎఫ్ నేతలు మున్నా, గణేష్ తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు సకాలంలో ఇవ్వాలని, ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు పంపిణీ చేయాలన్నారు.

బుల్లెట్ చోరీ

పుంగనూరు: పట్టణంలోని నానబాలవీధిలో వుంటున్న లక్ష్మీకాంత్‌రెడ్డి బుల్లెట్‌ను బుధవారం రాత్రి దుండగులు చోరీ చేశారు. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బైక్‌ను ఇంటి ముందు నిలిపానని, గురువారం ఉదయం లేచి చూడగా లేదని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

పలమనేరు: మండలంలోని జరావారిపల్లి ఎంపీటీసీ విజయకుమార్ కుమార్తె రేవతి, రాజు వివాహం గురువారం సెయింట్ లూయిస్ చర్చిలో జరిగింది. ఇందులో పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా జమీలా



పలమనేరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సభ్యురాలిగా పలమనేరుకు చెందిన జమీలాను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది,. తనకు ఈ అవకాశం కల్పించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వి.కోట: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని లయన్స్‌క్లబ్ ఆఫ్ వి.కోట అధ్యక్షుడు డాక్టర్ తమీమ్‌ఖాన్ తెలిపారు. ఇందులో బెంగళూరుకు చెందిన వైదేహీ ఆస్పత్రి వైద్యులు 241 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారని తెలిపారు. 24 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు ఇంద్రేష్‌యాదవ్, సాదత్, సురేంద్ర, నాగరాజేంద్ర, ధీరజ్, లోకేష్, చంద్రశేఖర్, తుకారాం, కృష్ణమూర్తి, రమేష్‌బాబు, శంకర్ పాల్గొన్నారు.

రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శికి సత్కారం



సదాశివయ్యను సత్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె–1 సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సదాశివయ్య దంపతులను గురువారం ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ సదాశివయ్య విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిశోర్‌గౌడు, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన అవసరం

పెద్దపంజాణి: ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి వుండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఆయన గురువారం కోగిలేరు యానిది కాలనీలో పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. స్థానికులు మాట్లాడుతూ తమ ఇళ్లపై చింతకొమ్మలు తొలగించాలని విన్నవించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో శారదాదేవి, ఎంఈవో గోపాల్‌రెడ్డి, ఏపీఎం నీరజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన, పంచాయితీ కార్యదర్శి బాలాజీ, వీఆర్‌వో శివ పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు సాయం చేయండి

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ–4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను సృష్టించేందుకు ధనికులు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆయన గురువారం పలమనేరు పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు, యాజమాన్యాలతో పీ–4పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన ఫార్ములాను వారికి వివరించారు. బంగారు కుటుంబాలకు తమవంతు సాయం అందించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు సన్మానించారు.

రూ.15.58 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ ఏర్పాటు

రొంపిచెర్ల: రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం కెమిస్ట్రీ ల్యాబ్‌ను నిర్మించినట్లు ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మీ తెలిపారు. ఆమె గురువారం ల్యాబ్‌ను ప్రారంభించారు. పీఎంఎస్ఆర్ఐ పథకం కింద ల్యాబ్‌ను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు పరికరాలు కూడా వచ్చాయన్నారు. పూర్తి స్థాయిలో పరికరాలు వస్తే వాటి ద్వారా పిల్లలతో ప్రయోగాలు చేయిస్తామని పేర్కొన్నారు. అలాగే బాలురు, బాలికల పాఠశాల పరిధిలోని క్లస్టర్ పాఠశాలలకు టాయిలెట్ క్లీనింగ్ మెటీరియల్ వచ్చిందని తెలిపారు. మరుగుదొడ్లు క్లీనర్ శానిటైజర్లు, టాయిలెట్ బౌల్ క్లీనర్లు, ఎయిర్ ఫ్రెషనర్లను పాఠశాలలకు ఇస్తామని తెలిపారు.

నోటీస్ బోర్డు

నేడు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ

చౌడేపల్లె: మండలంలోని లద్దిగం, కాటిపేరి, కాగతి, దిగువపల్లె పంచాయతీల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి తెలిపారు. అలాగే గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

5న పాలిటెక్నిక్‌లో ఓపెన్ అడ్మిషన్లు

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5న పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఓపెన్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ స్రవంతి తెలిపారు. ఏపీ పాలిసెట్ రాసి సీట్ పొందని వారు, పాలిసెట్ రాయకున్నా పదో తరగతి పాసైన వారు ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి వున్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

పులిచెర్ల(కల్లూరు): ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేయని రైతులు ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి లీలాకుమారి తెలిపారు. ముఖ్యంగా ఉలవలు, కందులు, ఉద్దులు సాగు చేయాలన్నారు. ప్రభుత్వం విత్తనాలు రాయితీతో ఇస్తుందని, ఇందుకోసం సమీపంలోని రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

పార్టీ బలోపేతానికే గ్రామ కమిటీలు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పలమనేరు: మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆదేశాల మేరకు పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వైఎస్సార్ సీపీ వార్డు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు పట్టణ కన్వీనర్ హేమంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం సంబందిత వార్డు నాయకులు, పట్టణ నేతలు కలిసి కొత్త కమిటీలను ఎంపికచేశారు. తద్వారా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, సల్మాశ్యామ్, శ్యామ్‌సుందర్, నయాజ్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

కరువు.. చంద్రబాబు కవల పిల్లలు



పెద్దయల్లకుంట్లలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు

చౌడేపల్లె: చంద్రబాబు, కరువు కవల పిల్లలని, ఆయన అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ రాష్ట్రంలో కరువు ఏర్పడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ విమర్శించారు. మండలంలోని పెద్ద యల్లకుంట్ల, కొండయ్యగారిపల్లె, చింతమాకులపల్లె, పుదిపట్ల గ్రామ పంచాయతీల్లో గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందన్నారు. పంటలకు గిట్టుబాటు ధర అందలేదన్నారు. ఆర్‌బీకేలను నిర్వీర్యం చేశారని తెలిపారు. వాటిలో ఎరువులు, విత్తనాలు లేకుండా చేశారని గుర్తు చేశారు. అన్నదాత సుఖీభవకు ఎగనామం పెట్టారని మండిపడ్డారు. హామీలు అమలుచేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు.

గ్రామ స్థాయి కమిటీలతో పార్టీ బలోపేతం

గ్రామస్థాయినుంచి కమిటీలను ఏర్పాటుచేసి పార్టీని బలోపేతం చేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి తెలిపారు. తద్వారా కూటమి ప్రభుత్వ మోసాలు, దౌర్జన్యాలను ప్రజలు వివరిద్దామన్నారు. కమిటీ సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన మేలు, కూటమి ప్రభుత్వం మోసాలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో బోయకొండ గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వెంకటరమణ, కోఆప్షన్ మెంబరు సాధిక్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, మాజీ డైరెక్టర్ రమేష్‌బాబు, సర్పంచులు షంషీర్, రఘునాథరెడ్డి, అనూరాధ, హైమావతి, హారతి, మునికృష్ణమనాయుడు, గిరి, శంకర్‌రెడ్డి, గంగిరెడ్డి, అనుప్రియ, బ్రహ్మానందరెడ్డి, సుబ్రమణ్యం రాజు, చంద్ర, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులతో అప్రమత్తంగా ఉండాలి

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు రిజర్వు ఫారెస్టులోకి రెండు ఏనుగులు ప్రవేశించాయని, పరిసర ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ బీటు అధికారిణి శ్రీదేవి తెలిపారు. రాత్రిళ్లు పొలాల దగ్గర పడుకోవద్దని, తెల్లని దుస్తులు ధరించి అడవిలోకి వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా కల్లూరు, గంటావారిపల్లె రోడ్డు మార్గంలో వెళ్లే వాహనదారులు చాలా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

పలమనేరు: పేదలపై పెనుభారంగా మారనున్న స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని నీళ్లకుంటలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. గతంలో చంద్రబాబు, నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు పెడితే పగులగొట్టాలని జనాన్ని రెచ్చగొట్టారని తెలిపారు. ఇప్పుడు వారే మీటర్లను ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. వీటిని ఏర్పాటు చేస్తే మూడు స్లాబుల సిస్టం అమలు చేసి భారీగా కరెంట్ బిల్లులు పెంచుతారని పేర్కొన్నారు. ముందుగా రీచార్జ్ చేసుకోకుంటే చీకటి రాత్రులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిధర్‌గుప్త, రాజా, జయంతి, హైదర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.